
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 1 ఆగస్టు 2025

ఎరువుల సమస్యలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల లభ్యత, సరఫరా, ధరలపై ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై 9121863788 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కంట్రోల్ రూమ్ ద్వారా రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయాధికారులు సమర్థవంతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎన్నాళ్లీ కష్టాలు?

- కడపల గెడ్డపై పూర్తికాని బ్రిడ్జి నిర్మాణం
- మూడు నెలలపాటు నత్తనడకన పనులు
- కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం
- ప్రస్తుతం గెడ్డలో ప్రవహిస్తున్న వరద
- దబ్బపాడు గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు


కడపలగెడ్డపై నిలిచిన బ్రిడ్జి పనులు

ఎల్.ఎన్.పేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామం వంశధార నదీతీరంలో ఉంటుంది. వర్షాకాలం వచ్చిందంటే వరదలతో ఆ ఊరుకు మూడు నెలలపాటు రాకపోకలు నిలిచిపోతాయి. ఆ గ్రామ ప్రజలు అత్యవసర సమయాల్లో పట్టణాలకు వెళ్లాలంటే నరకయాతన పడాల్సిందే. కడపల గెడ్డపై బ్రిడ్జి నిర్మిస్తే తమ కష్టాలు తీరుతాయని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు వినతులు అందించినా ఫలితం శూన్యం. గత వైసీపీ ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు మాత్రం చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వంతెన పనులు ప్రారంభించారు. కానీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇప్పటికీ బ్రిడ్జి పూర్తికాలేదు. దీంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ మండలంలోని (మిగతా 6వ పేజీలో..)

ఇదీ పరిస్థితి..

ప్రతిఏటా వర్షాకాలంలో వంశధార నదికి వరదలు వస్తుంటాయి. ఈ వరదకు కొండ ప్రాంతాల్లో కురిసే వర్షపు నీరు తోడైతే తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్యఉన్న కడపల గెడ్డకు వరద పోటెత్తుతుంది. గెడ్డలోని నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుంటుంది. దీంతో దబ్బపాడు గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. అత్యవసర సమయాల్లో ఆ గ్రామస్థులు వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. దీనికోసం సుమారు ఐదారు కిలోమీటర్లు ప్రయాణించి ఎల్ఎన్‌పేట జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుకు చేరుకోవాల్సి వస్తుంది. దీనివల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో వైద్య సేవలందక ప్రాణాలను సైతం కోల్పోవలసి వస్తుందని గ్రామస్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వరదొస్తే ఆగిపోవాల్సిందే!

- సీతన్నపేట గెడ్డ పాత వంతెనపైకి ప్రవహిస్తున్న నీరు
- రెండు మండలాలకు నిలిచిపోతున్న రాకపోకలు
- 20 గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు
- కొత్త బ్రిడ్జి కోసం ఎదురుచూపు


సీతన్నపేట గెడ్డవద్ద వంతెనపై ప్రవహిస్తున్న వరద (ఫైల్)

కోటబొమ్మాళి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిస్తే చాలు కోటబొమ్మాళి- సంతబొమ్మాళి రహదారిలోని సీతన్నపేట గెడ్డ పాత వంతెనపైకి నీరు వచ్చేస్తుంది. సుమారు 80 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన కావడం, ఆక్రమణలతో గెడ్డ కుచించుకుపోవడం వంటి కారణాలతో భారీ వర్షాల సమయంలో వరద వంతెనపై నీరు ప్రవహిస్తుంది. దీంతో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఈ సమయంలో సుమారు 20 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. కొత్త వంతెన నిర్మిస్తేనే తమ కష్టాలు తీరుతాయని వారు అంటున్నారు.

- కోటబొమ్మాళి- సంతబొమ్మాళి రోడ్డు ఎంతో ప్రధానమైనది. ఈ రోడ్డు గుండా సంతబొమ్మాళి మండలంలోని సంతబొమ్మాళి, గోదాయవలస, శివరాంపురం, నర్సాపురం, యర్నాగులపేట, కోటబొమ్మాళి మండలంలోని దుర్గంపేట, ఉప్పరపేట, సీతన్నపేట, ఊడికలపాడు, వరహాలమ్మపేట తదితర 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి మధ్యలో సీతన్నపేట గెడ్డ వద్ద పురాతన వంతెన ఉంది. ప్రతీ ఏడాది కురిసిన భారీ వర్షాలకు రెండు మూడు రోజుల పాటు ఈ వంతెనపై వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ సమయంలో రెండు మండలాల పరిధిలోని 20 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద కారణంగా మండల కేంద్రాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. కొన్నిసార్లు ప్రమాదమని తెలిసినా కొందరు విధిలేక వరద నీటిలో ప్రయాణం చేస్తుంటారు. పాత వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నా పాలకులు (మిగతా 6వ పేజీలో..)


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

తీరప్రాంత భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోండి

- అనుమతి లేని బోట్లను పోర్టులోకి అనుమతించొద్దు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళంకలెక్టరేట్, జూలై31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బారువ, కళింగపట్నం, భావనపాడు తదితర తీరప్రాంతాల భద్రతకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. 'సముద్రంపై పనిచేసే ప్రతీ మత్స్యకారుడు భద్రతతో కూడిన లైఫ్ జాకెట్ విధిగా ధరించేలా చర్యలు తీసుకోవాలి. మత్స్యకారులకు లైఫ్ జాకెట్లను రాయితీపై అందిస్తాం. అవి లేకుండా సముద్రంలోకి వెళ్లే వారిపై చర్యలు తప్పవు. నభ్‌మిత్రా యాప్ ద్వారా ఫిషింగ్ బోట్ల ట్రాకింగ్ చేయాలి. కొన్ని తీర ప్రాంతాల్లో నెట్ కనెక్టివిటీ కోసం ఎన్ఐసీ జిల్లా సమాచార (మిగతా 6వ పేజీలో..)

తీరం భద్రత ఎలా?



- జిల్లాలో మెరైన్ పోలీస్‌స్టేషన్ల కొరత
- జాడలేని కొత్త స్టేషన్లు
- జూన్ నుంచి సెప్టెంబరు వరకూ విపత్తులు
- మత్స్యకారుల రక్షణకు ఇక్కట్లు

ఇచ్ఛాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సముద్ర తీర ప్రాంత భద్రతపై ఆందోళన నెలకొంది. 11 మండలాల్లో 193 కిలోమీటర్ల తీర ప్రాంతం విస్తరించి ఉన్నా అందుకు తగ్గట్లు మెరైన్ పోలీసు స్టేషన్లు లేవు. కేవలం మూడు మెరైన్ పోలీస్‌స్టేషన్‌లే ఉన్నాయి. దాదాపు 120 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. 20 మందికి మించి లేరు. దీంతో సుదీర్ఘ తీర ప్రాంతాన్ని సంరక్షించడం వారికి కత్తిమీద సాములా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కావడం, ఈ ఏడాది బంగాళాఖాతంలో విపత్తులు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో తీర ప్రాంత భద్రతపై అనుమానాలు, ఆందోళనలు కలుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, గార, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో తీర ప్రాంతం ఉంది. రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. దీనిపరిధిలో 143 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. మారుమూల కుగ్రామాలు 20 వరకూ ఉన్నాయి. వందలాది కిలోమీటర్లు ఉన్న తీర ప్రాంతంలో ఉన్నది మూడే మెరైన్ పోలీస్‌స్టేషన్లు. మెరైన్ పోలీస్‌స్టేషన్లు పెంచుతామని ప్రభుత్వ ప్రకటన ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. ఒక్కో స్టేషన్ పరిధిలో మూడు నుంచి నాలుగు మండలాలు ఉండడం దారుణం. వాస్తవానికి ఒక కానిస్టేబుల్‌కు ఒక గ్రామంచొప్పున బాధ్యతలు అప్పగించాలి. కానీ, ఐదు నుంచి పది గ్రామాల బాధ్యతను ఒక్కో కానిస్టేబుల్‌కు అప్పగిస్తున్నారు. ఏటా భారీ తుఫాన్‌లు సంభవిస్తుంటాయి. ఆ సమయంలో మత్స్యకారులను అప్రమత్తం చేయడం.. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించడం వారికి ఇబ్బందికరంగా మారుతోంది.



కళింగపట్నం మెరైన్ పోలీసు స్టేషన్

ఆ మూడుచోట్ల ఏర్పాటు..

జిల్లాలో కళింగపట్నం, భావనపాడు, బారువలో మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. సముద్ర తీరంలో 12 నాటికల్ మైళ్ల దూరం వరకూ నిరంతర (మిగతా 8వ పేజీలో..)

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ

- అవకాశం ఇచ్చిన ప్రభుత్వం

నరసన్నపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ జీవో నెం.134ను ఇటీవల విడుదల చేశారు. 2019 ఆగస్టుకు ముందు ప్లాట్లు, వెంచర్లు వేసిన వారు ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజ్ స్కీం) ద్వారా దరఖాస్తు పెట్టుకుంటే వాటిని రెగ్యులరైజ్ చేస్తూ వచ్చారు. తాజాగా, ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం.. ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు అనధికార లేఅవుట్లకు మార్కెట్ విలువలో 7శాతం ప్రభుత్వానికి చెల్లిస్తే అధికారులు వాటిని క్రమబద్ధీకరణ చేయనున్నారు. జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, రణస్థలం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస, టెక్కలి, గార , కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తదితర మండలాల్లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ లేఅవుట్లను అధికారులు గుర్తించారు. సుడా అనుమతులు లేకుండా వెంచర్లు వేసిన 165 మందికి గతేడాది నోటీసులు జారీ చేశారు. అనాధికారంగా వేసిన లేఅవుట్‌లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. క్రమబద్ధీకరణ అవకాశం పొందిన స్థలదారులు భవన నిర్మాణ అనుమతుల సమయంలో బెటర్‌మెంట్, ఓపెన్ స్పేస్ కింద 14శాతం చెల్లించాల్సిన అవసరం ఉండదని ఉత్తర్వులు జారీ చేసింది.


నరసన్నపేట శివారులో హైవే పక్కనే వేసిన అక్రమ లేఅవుట్



గిరిజన మహిళకు ప్రసవ కష్టాలు

- బురదలో కూరుకుపోయిన 108
- అతి కష్టమ్మీద ఆసుపత్రికి తరలింపు

8 లో

రేపే అన్నదాత సుఖీభవ

- రైతుల ఖాతాల్లోకి రూ.184కోట్లు
- జిల్లాలో 2,74,301 మందికి లబ్ధి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలోని రైతులకు శనివారం రూ.184కోట్లు అందించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అధ్యక్షతన జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. 'ఈ పథకం ద్వారా జిల్లాలో 2,74,301 మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. రాష్ట్ర వాటా కింద రూ.138కోట్లు, కేంద్ర పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.46కోట్లు మంజూరు అవుతాయి. శనివారం ప్రతీ గ్రామంలో సభ నిర్వహించి, అర్హులైన రైతులకు.. అన్నదాత సుఖీభవ పథకం అందించాలి. ఒక్కో రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20వేల ఆర్థిక సహాయం అందుతుంది. కేంద్రం ద్వారా రూ.6వేలు, రాష్ట్రం ద్వారా రూ.14వేలు మూడు విడతలుగా అందిస్తాం. తొలి విడతగా శనివారం రూ.7వేలు విడుదల చేస్తాం. రైతులు తమ అర్హతను 'అన్నదాత సుఖీభవ' పోర్టల్ లేదా 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తెలుసుకోవాలి. ఏఎఫ్‌సీ లింక్, ఆధార్-బ్యాంకు ఖాతాల అనుసంధానం వంటివి కూడా పూర్తి చేసుకోవాలి.' అని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, ఉద్యానవన అధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు దుకాణాలపై అధికారుల దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసన్నపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలోని పలు బంగారు దుకాణాలపై తూనికలు, కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ చిన్నమ్మి ఆధ్వర్యంలో ఆశాఖ అధికారులు గురువారం దాడులు చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన నరసన్నపేటలో గోల్డ్‌మాల్ కథనంపై ఉన్నత అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు తూనికల శాఖ అధికారులు బంగారు దుకాణాలపె దాడులు చేసి తూనిక యంత్రాలు, బిల్లులను పరిశీలించారు. వినియోగదారులకు ఇచ్చే బిల్లులపై బంగారు నాణ్యత తెలిపే వివరాలు లేకపోవడాన్ని గుర్తించారు. తూనిక యంత్రాలకు సీలింగ్ వేసుకోవాలన్నారు. రాళ్లతో కూడిన బంగారు ఆభరణాలను తూకం వేసే సమయంలో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా, తూనికలు కొలతల శాఖ అధికారులు దాడులతో బంగారు వ్యాపారుల్లో అలజడి రేగింది. అధికారుల రాక సమాచారం తెలుసుకున్న కొందరు (మిగతా 7వ పేజీలో..)

పాత్రునివలసలో నేడు పింఛన్ల పంపిణీ

- హాజరుకానున్న మంత్రి కొండపల్లి

శ్రీకాకుళం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత్రునివలస గ్రామంలో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరుకానున్నారని అధికారులు తెలిపారు. ఈ గ్రామంలో 463 మందికి రూ.19.29 లక్షల విలువైన పింఛన్లు మంజూరయ్యాయి.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దుప్పలవలస, ఎచ్చెర్లలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు బి.బుచ్చిరాజు, పి.పద్మజ గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. దుప్పలవలస గురుకులంలో ఐదో తరగతిలో 13, ఏడో తరగతిలో 1, పదో తరగతిలో 8, ఇంటర్ ప్రథమ ఎంపీసీలో 2, ద్వితీయ బైపీసీలో 8, ఎంపీసీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎచ్చెర్ల గురుకులంలో ఇంటర్ ప్రథమ ఎంపీసీలో 10, బైపీసీలో 2 సీట్లు ఖాళీలు ఉన్నాయి. వివరాలకు 9704550004 (దుప్పలవ లస), 9441957009(ఎచ్చెర్ల) నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

పర్యవేక్షణ లేక.. నియంత్రణకు నోచుకోక

- ఇష్టారాజ్యంగా ఎరువుల విక్రయం

6 లో

తల్లిపాలే అమృతం

- బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం
- అమ్మకూ వ్యాధులు దూరం
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

6 లో


ఎచ్చెర్లలో ఉదయం ఎండకు గొడుగు పట్టుకుని గొర్రెలను మేపుతున్న కాపరి

ఎండ.. వాన

జిల్లాలో గత కొద్ది రోజులుగా వాతావరణంలో విచిత్ర పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. అప్పుడే ఎండ కాస్తుంది.. ఆ వెంటనే వర్షం పడుతుంది. మళ్లీ వెంబడే ఎండ వస్తుంది. ఇలా.. ఏ క్షణంలో ఎండ ఉంటుందో.. ఏ క్షణంలో వర్షం పడుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంటుంది. గురువారం ఉదయం భానుడు చుర్రుమనిపించాడు. మధ్యాహ్నం తరువాత వాతావరణం మారింది. కారుమబ్బులు కమ్మేసి వర్షం కురిసింది. కొద్దిసేపటికి మళ్లీ సూర్యుడు ప్రత్యక్షమయ్యాడు.


శ్రీకాకుళం నగరంలో సాయంత్రం కురుస్తున్న వర్షం

తల్లిపాలే అమృతం



- బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం
- అమ్మకూ వ్యాధులు దూరం
- డబ్బా పాలకు దూరంగా ఉండడమే మేలు
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ఇచ్ఛాపురం/నరసన్నపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి):

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం. అంతకు మించి బాలింతకు ఆరోగ్యకరం. కానీ ఈ విషయం తెలియని చాలామంది బిడ్డలకు పాలివ్వకుండా వారి అనారోగ్యానికి కారణమవుతున్నారు. తాము సైతం రొమ్ము క్యాన్సర్‌తో పాటు రక్తపోటు, మధుమేహం వంటి వాటికి గురవుతున్నారు. పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్ఠమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కానీ శరీర ఆకృతి మారిపోతుందని.. అందం, ఛాయ తగ్గిపోతుందని చాలా మంది బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం మరుస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం. అందుకే తల్లిపాల ఆవశ్యకతను చాటి చెప్పేందుకు ఏటా ఆగస్టు 1 నుంచి వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తుంటారు.

బిడ్డ పుట్టిన క్షణం నుంచే..

సహజ సిద్ధంగా లభించే తల్లిపాల బదులు డబ్బా పాలు పడుతుండడం పిల్లల భవితకే ముప్పుగా పరిణమిస్తోంది. తల్లి రోజుకు 600 మిల్లీలీటర్ల వరకూ పాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. కనీసం 500 మిల్లీలీటర్ల పాలు ఇస్తే..ఇతరత్రా రూపాల్లో ఆహారం అందించాల్సిన అవసరం లేదు. బిడ్డ పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం ప్రారంభించాలి. అలా రెండేళ్ల వయసు వరకూ ఇవ్వచ్చు. మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలి. తద్వారా అస్తమా, ఎలర్జీ, ఇమ్యూనిటీ లోపం, బీపీ, బ్లడ్‌క్యాన్సర్, డయాబెటిస్, ఎదుగుదల లోపం వంటి రుగ్మతల నుంచి బిడ్డను కాపాడవచ్చు. నవజాత శిశువులకు తల్లిపాలు బదులు పోత పాలు పట్టడంతో వివిధ రుగ్మతల భారిన పడుతున్నారు. ఎదుగుదల లోపం, శ్వాస సంబంధ వ్యాధులు, అస్తమా వంటి వాటికి గురవుతున్నారు. ప్రాథమిక స్థాయిలో తల్లి పాలు ఇవ్వకపోతే ఆ చిన్నారికి జీవితాంతం చాలా రకాల రుగ్మతలు వెంటాడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బిడ్డలకు తల్లిపాలు ఇస్తున్నారు. కానీ పట్టణ, నగర ప్రాంతాల్లో మాత్రం చిన్నారులకు తల్లిపాలు అందడం లేదు.



ప్రయోజనాలివే..

ఏ వయసుల వారైనా ఆహార పదార్థాలు ఎంత తాజాగా తీసుకుంటే.. అంత ఆరోగ్యంగా ఉంటారు. పిల్లలకైనా అదే వర్తిస్తుంది. తల్లిపాలు తాగడం వల్ల శిశువులు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదుగుతారు. బిడ్డకు జన్మనిచ్చిన నాలుగు రోజుల వరకూ తల్లి ఉత్పత్తి అయ్యే పాలను ముర్రుపాలు అంటారు. అవి పిల్లలకు ఎలాంటి అలర్జీలు, ఇన్‌ఫెక్షన్లు సోకకుండా కాపాడతాయి. ఈ పాలు పిల్లల జీర్ణవ్యవస్థకు ఎలాంటి హాని కలగకుండా రక్షిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. తల్లిపాలు తాగి పెరిగిన పిల్లల మెదడు చురుగ్గా పనిచేస్తుందని వివిధ అధ్యయనాలు తేల్చాయి. పిల్లలు బాగా చదవాలన్నా..భవిష్యత్‌లో అభివృద్ధి సాధించాలన్నా..పుట్టిన పాపాయికి కొన్ని నెలల పాటు తల్లిపాలు తాగించడం ఎంతో శ్రేయస్కరం. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. ఈ పాలలో విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్‌లు వంటి ఎన్నో పోషక గుణాలు ఉంటాయి. పాపాయి శరీరానికి అవసరమైన కొవ్వును కూడా అందిస్తాయి. ఇవన్నీ బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడతాయి. తల్లిపాలు సులభంగా జీర్ణం కావడంతో మలబద్ధకం, జీర్ణ సంబంధిత సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయి. ఎదిగే బిడ్డ వయసుకు తగ్గట్టు బరువును ఉంచడంలో కూడా తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయి.

తల్లికీ ఎంతో మేలు..

తల్లి పాలు తాగడం వల్ల పాపాయికే కాదు.. తల్లికి కూడా ఎంతో ఆరోగ్యకరం. దీని వల్ల ఆక్సిటోసిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఇది పాలు పడడానికే కాకుండా గర్భాశయం త్వరగా సంకోచించేందుకు కూడా దోహదపడుతుంది. దీంతో కాన్పు తరువాత రక్తస్రావమూ తగ్గుతుంది. మాతృ మరణాల్లో ఎక్కువగా రక్తస్రావం ఆగకపోవడమే ప్రధాన కారణంగా నిపుణులు చెబుతారు. కాన్పు తరువాత ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటివి పిల్లలకు పాలివ్వడం ద్వారా పూర్తిగా తగ్గుతాయి. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా గర్భిణిగా ఉండే సమయంలో పెరిగిన బరువు కూడా తగ్గుతుంది. పాలిచ్చే క్రమంలో తల్లి శరీరంలో ఉండే క్యాలరీలు ఎక్కువగా ఖర్చవుతాయి. తద్వారా చాలా సులువుగా బరువు తగ్గవచ్చు. పాలు పట్టడం వల్ల తల్లికి మధుమేహం, అధిక రక్తపోటు వంటి వాటి బారినపడే అవకాశం ఉండదని నిపుణులు చెబుతున్నారు. బిడ్డకు పాలిచ్చే మహిళలకు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ ముప్పు చాలా తక్కువని నిపుణులు చెబుతున్నారు. అన్నింటికీ మించి తల్లిపాలు ఇవ్వడం ద్వారా.. పిల్లలకు, తల్లులకు మధ్య అనుబంధం పెరుగుతుంది. అందుకే సమాజంలో ప్రతిఒక్కరూ తల్లిపాల ఆవశ్యకత తెలుసుకొని అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 16 ఐసీడీఎస్ ప్రాజెక్టలుండగా.. వాటి పరిధిలో 2,759 మెయిన్ అంగన్వాడీకేంద్రాలు, 599 మినీ అంగన్వాడీ కేంద్రాలు, 25 పీఎం జన్మాన్ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఉన్నాయి. వీటి పరిధిలోని గర్భిణులు, బాలింతలకు వందశాతం పోషక విలువలున్న తల్లిపాల ఆవశ్యకత వివరిస్తూ ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను జిల్లాలో ఆగస్టు 1 వతేది నుంచి 7వ తేది వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

తల్లిపాలే ఆహారం..

ఆరునెలలు పాటు తల్లిపాలు ఇస్తే బిడ్డకు తేలికంగా జీర్ణమవుతుంది. ఎలాంటి శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధులు రావని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోజులో బిడ్డకు 8-10 సార్లు పాలు ఇవ్వాలని, రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పడితే వాటిలో ప్రొటీన్లు అధికంగా ఉండి బిడ్డకు రోగాలను ఎదుర్కొనే శక్తి పెంచుతాయని చెబుతున్నారు. తల్లిపాలలో ప్రొటీన్లు, ల్యాక్టోపెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగనిరోధక బ్యాక్టరీయా ఉండడంతో పిల్లలు ఎక్కువ బలంగా ఉంటారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లీ, బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది. పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం తక్కువగా ఉంటుంది. పాలిచ్చనంత కాలం మళ్లీ గర్భం రాకుండా నిరోదకంగా కూడా పనిచేస్తుంది. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.

రోగ నిరోధకశక్తిని పెంపొందిస్తాయి..

పుట్టిన బిడ్డలకు ముర్రిపాలు పట్టడం ఎంతో శ్రేష్ఠం. ఈ పాలు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. పిల్లలకు రెండేళ్ల వరకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా ఇద్దరూ రోగాలు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటారు.

-రెడ్డి సంధ్య, గైనకాలజిస్టు, నరసన్నపేట

అవగాహన కల్పిస్తున్నాం..

ఆగస్టు 1 నుంచి 7వ తేది వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం. పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వరకు కచ్చితంగా తల్లిపాలు తాగించాలి. వారోత్సవాల్లో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సు ను నిర్వహిస్తాం.

-ఐ.విమల, ఐసీడీఎస్ పీడీ

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం..

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలి. డబ్బాపాలు, పోతపాలు పిల్లల ఎదుగుదలకు అంత క్షేమం కాదు. తల్లిపాలే పిల్లలకు అపర సంజీవినిలా పనిచేస్తాయి. ఈ విషయంలో ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలి.

-పి.దేవేంద్రరెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, ఇచ్ఛాపురం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

విపత్తుల సమయంలో సమన్వయం అవసరం

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సునామీ వంటి విపత్తుల సమయంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అవసరమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీరప్రాంత గ్రామాల్లో సునామీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, మత్స్యకారుల కుటుంబాలు, వలలు, పడవలు, ఇతర ఆస్తులకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అవలంబించాల్సిన చర్యలపై సమీక్షించారు. ప్రతీ శాఖ తమకంటూ ఒక కార్యాచరణ విధానాన్ని రూపొందించుకోవాలని, దానిని సమర్థవంతంగా అమలుచేసేందుకు వనరులను సమకూర్చుకోవాలన్నారు. కీలక శాఖలైన పోలీసు, రెవెన్యూ, వ్యవసాయం, పశుసంవర్ధక, రాష్ట్ర విపత్తుల నిర్వహణ తదితర ముఖ్య శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాము మాట్లాడుతూ.. తుపానుల సమయంలో ఆశ్రయ కేంద్రాలను నిర్వహిస్తామని, కాని సునామీ వంటి పరిస్థితుల్లో అవి కూడా సురక్షితం కాదని, బాధితులను తరలించేందుకు ప్రత్యేకమైన, సురక్షితమైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. అత్యవసర కేంద్రాల నుంచి సమాచారం అందిన వెంటనే అన్ని శాఖలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆర్డీవో గంగాధర్ మాట్లాడుతూ.. సునామీ సమయంలో ప్రజల తరలింపునకు సరైన ప్రణాళిక రూపొందించామన్నారు. తరలింపునకు ప్రజలు సరిగా సహకరించడం లేదని, ఆయా గ్రామాల కుల పెద్దల సహకారం తీసుకోవాలని పోలీసు అధికారులు కోరారు. విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా సహాయ అధికారి శ్రీనుబాబు మాట్లాడుతూ.. సునామీ ముందు, సునామీ సమయం, ఆ తరువాత స్పందించేందుకు అన్ని శాఖల సమన్వయం, సహకారంతో ఏర్పాట్లు చేశామని, పరికరాలు సమకూర్చుకున్నామన్నారు. డీఎస్పీ శేషగిరి మాట్లాడుతూ.. సునామీ సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినే అవకాశం ఉన్నందున, వైర్‌లెస్ సెట్ల ద్వారా సేవలందిస్తామన్నారు. మత్స్యశాఖ డీడీ సత్యనారాయణ, పోలీసుస్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సీఐలు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ కష్టాలు?

(ఐదో పేజీ తరువాయి)

దబ్బపాడు గ్రామస్థుల దయనీయ పరిస్థితి.

నత్తనడకన పనులు..

తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్యఉన్న కడపల గెడ్డపై బ్రిడ్జి నిర్మిస్తామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. దీనికోసం అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆర్భాటంగా శంకుస్థాపన కూడా చేశారు. కానీ, నిధులు మాత్రం మంజూరు చేయకపోవడంతో పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కడపల గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.67 లక్షలు ఎస్‌డీఎంఎఫ్ నిధులు మంజూరు చేసింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఈ ఏడాది ఏప్రిల్ 29న శంకుస్థాపన చేయడంతో దబ్బపాడు గ్రామస్థుల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. బ్రిడ్జి నిర్మాణం జరిగి వర్షాకాలంలో తమ ఇక్కట్లు తీరిపోతాయని ఎంతో సంబరపడిపోయారు. కానీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా సుమారు మూడు నెలల పాటు నత్తనడకన పనులు జరగడంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తికాలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకుతోడు వంశధార కుడిప్రధాన కాలువ దిగువన ఉన్న ఆయకట్టుకు పిల్లకాలువల ద్వారా నీరు వస్తుండడంతో కడపల గెడ్డలో నీరుపొంగి ప్రవహిస్తుంది. దీంతో బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి వరకూ కడపల గెడ్డలో నీరు ప్రవహిస్తుంది. బ్రిడ్జి పనులు మళ్లీ ప్రారంభించాలంటే మార్చి వరకు ఆగాల్సిందే. అప్పటివరకు తమకు కష్టాలు తప్పవని దబ్బపాడు వాసులు వాపోతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేశారు..



కడపల గెడ్డపై బ్రిడ్జి పనులు చేపట్టడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేశారు. నెల రోజుల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. కానీ, మూడు నెలలు అవుతున్నా పూర్తి చేయలేదు. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోలేదు.

-మోహనరావు, మాజీ సర్పంచ్, దబ్బపాడు

వరదొస్తే ఆగిపోవాల్సిందే!

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు పట్టించుకోవడం లేదు. కూటమి పాల నలోనైనా కొత్త వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి..



కోటబొమ్మాళి-సంతబొమ్మాళి రహదారి మధ్యలో ఉన్న సీతన్నపేట గెడ్డ వద్ద కొత్త వంతెన నిర్మించాలి. భారీ వర్షం కురిసిన ప్రతీ సారి పాత వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుంది. దీనివల్ల కూరగాయలను మార్కెట్‌కు తీసుకువెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త వంతెన నిర్మిస్తే ప్రజల కష్టాలు తీరుతాయి.

-ఆదినారాయణ, రైతు, ఊడికలపాడు

తీరప్రాంత భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోండి

(ఐదో పేజీ తరువాయి)

అధికారితో సమన్వయం చేసుకోవాలి. ఇతర పోర్టుల నుంచి బోట్లు మానవీయ కారణాలతో వచ్చినా సరే, నిర్వాహక అనుమతి లేనిదే పోర్టులోకి అనుమతించరాదు. బీచ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆదివారాలు, సెలవు దినాల్లో గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. గ్రామీణ మత్స్యకార ప్రాంతాల్లో వాలీబాల్, నెట్ తదితర క్రీడాసామగ్రిని అందించాలి. మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. మెరైన్ పోలీసు స్టేషన్‌లకు బయో ఫెన్సింగ్ విధానంలో రక్షణ గోడ ఏర్పాటు చేసుకోవాలి. తీర ప్రాంతాల్లో వాచ్ టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలి.' అని ఆదేశించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, మెరైన్ ఎస్పీ ఇండియన్ నేవీ స్టాఫ్ ఆఫీసర్ ఆదిత్య పాండే, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, విపత్తుల నిర్వహణ శాఖ డీపీఎం రాము, మత్స్యశాఖ డీడీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పలాస చేరిన శ్రీనివాస్, జయశ్రీ దంపతులు

హిందూ ధర్మంపై అవగాహన కోసం..

- ద్విచక్రవాహనంపై వృద్ధ దంపతుల దేశయాత్ర

పలాస, జూలై 31(ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతి, హిందూ సంప్రదాయాలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని వివరిస్తూ, ప్రజలకు హిందూ ధర్మంపై అవగాహన కల్పిస్తుంచడానికి ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు చెందిన వృద్ధ దంపతులు డాక్టర్ ఎ.శ్రీనివాస్‌నేతా, జయశ్రీ దేశయాత్ర నిర్వహిస్తున్నారు. గురువారం పలాస రైల్వేస్టేషన్ వద్ద గల సీతారామాలయానికి చేరుకున్న వారికి భక్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, జయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ 2024 జూన్ 17న హైదరాబాద్‌లో యాత్రను ప్రారంభించామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలు, జ్యోతిర్లింగాలు దర్శించామని, తాము ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ భాషలో కరపత్రాలు పంపిణీచేసి ప్రజలకు హిందూయిజంపై జాగృతం చేస్తున్నామని తెలిపారు. రెండు నెలల్లో యాత్ర ముగిస్తుందని, తిరిగి స్వగ్రామానికి వెళ్లిపోతామని చెప్పారు.

రైల్వేస్టేషన్లో ఆవుల తిష్ఠ

- ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

ఇచ్ఛాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ టికెట్ బుకింగ్ కౌంటర్ ఇది. ఇక్కడ స్టేషన్లోనూ, బయట ఆవులు, ఎద్దులు తిరగాడుతుంటాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం వేకువజామున 3.30 గంటలకు బరంపురం-విశాఖపట్నం వెళ్లే ప్యాసింజర్ ఎక్కేందుకు వందమంది ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో బుకింగ్ కౌంటర్ చుట్టూ ఆవులు కాపుకాసి ఉన్నాయి. వాటిని దాటి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. వాటిని అదిలించినా కదల్లేదు. రైలు వచ్చే సమయం దగ్గర పడుతుండడంతో ప్రయాణికులు టెన్షన్‌కు గురయ్యారు. కొంతమంది ఆవులను తప్పించుకుంటూ వెళ్లి టికెట్లు తీసుకున్నారు. మరికొందరు తీసుకోలేక ట్రైన్ ఎక్కి వెళ్లారు. కొన్నిసార్లు ప్లాట్‌ఫాం పైకి కూడా ఆవులు వస్తుండడంతో రైలు వచ్చినప్పుడు ఏదేని ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఆవుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు.



బుకింగ్ కౌంటర్ వద్ద అడ్డుగా పడుకున్న ఆవులు, ఎద్దులు



రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఆవు

పర్యవేక్షణ లేక.. నియంత్రణకు నోచుకోక

- అటకెక్కిన ఎమ్మార్పీ
- కనిపించని బఫర్‌స్టాక్
- ఇష్టారాజ్యంగా ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులు
- యూరియా బస్తా రూ.350, డీఏపీ రూ.1,450కి విక్రయం

టెక్కలి, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల విక్రయంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ధరలపై నియంత్రణ కొరవడింది. దీనిని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఎమ్మార్పీని అటకెక్కిస్తున్నారు. ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. యూరియా బస్తా రూ.350, డీఏపీ రూ.1,450కి విక్రయిస్తున్నారని చెబుతున్నారు. అడపాదడపా వ్యవసాయశాఖ అధికారులు విజిలెన్స్ బృందాలతో కలిసి తనిఖీలు చేసిన సమయంలో ఎరువుల వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ తర్వాత షరామామూలుగా వ్యవహరిస్తున్నారని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పైరుకు తక్షణమే యూరియా, డీఏపీ చల్లాలి. దీనిని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ధరలు పెంచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. రూ.267కు విక్రయించాల్సిన యూరియా రూ.350కు, రూ.1,350లు అందజేయాల్సిన డీఏపీ రూ.1,450కు ఎరువుల వ్యాపారులు అమ్మకాలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఎరువుల ధరలు భారీగా పెంచి వ్యాపారులు విక్రయిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు చోద్యంచూస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వీటికితోడు యూరియా, డీఏపీ ఇవ్వాలంటే గులుకులు కూడా కొనుగోలు చేయాలని, లేకపోతే ఈ రెండు ఎరువులు ఇవ్వడంలేదని పలువురు చెబుతున్నారు. దీంతో గత్యంతరం లేక గులుకులు కొనుగోలు చేయాల్సివస్తోంది. రైతు సేవా కేంద్రాలు ద్వారా ఎరువులను విక్రయిస్తున్నామని అధికారులు చెబుతున్నా, కొద్దిమందికి మాత్రమే అందుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎరువులు బఫర్‌స్టాక్ సిద్ధం చేశామని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటనలు మాటలు వరకే పరిమితమవుతున్నాయి. ఎక్కడా బఫర్‌స్టాక్ కనిపించని కనిపించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు..

యూరియా రూ.267కు, డీఏపీ రూ.1,350కు విక్రయించాలని, అంతకంటే ఎక్కువ ధరకు అమ్మితే వ్యాపారులపై చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహనరావు తెలిపారు. అధిక ధరలకు అమ్ముతున్నట్లు తన నోటీసుకు రాలేదని చెప్పారు. ఇప్పటికే వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు ఉమ్మడిగా ఎరువుల షాపులు తనిఖీలు చేశారని తెలిపారు.



దారుణంగా..

పీఎంజీఎస్‌వైలో భాగంగా బారువ-రట్టి గ్రామాల మధ్య నిర్మించిన రోడ్డు ఏడాదికే పాడైంది. రాజాం కస్తూర్బా పాఠశాల వద్ద, అక్కడ నుంచి 200 మీటర్ల దూరంలో మరో కల్వర్టు వద్ద గోతులుగా తయారైంది. దీంతో రాకపోకల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన దారులు పేర్కొంటున్నారు. దీనిపై పీఐయూ ఏఈఈ ధనుంజయ్ వద్ద ప్రస్తావిం చగా రహదారి నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్ దేనని, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

-సోంపేట రూరల్



అధ్వానంగా తయారైన రోడ్డు

ఆదమరిస్తే..



ప్రమాదకరంగా ఉన్న కాలువ

టీడీవలస దళితవాడ ప్రధానవీధిలో కాలువపై పలకలు పాడవడంతో ప్రమాదకరంగా ఉంది. నిత్యం ప్రజలు ఈ మార్గం లోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవ హరించినా కాలువలో పడి గాయాలబారిన పడాల్సిందే. కాలువ పై పలకలు ఏర్పాటు చేయాల్సిన పంచాయతీ అధికారులు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు స్పందించి కాలువపై పలకలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

-జి.సిగడాం

అసంపూర్తిగా

పాలవలస గ్రామంలో కాంగ్రెస్ హయాంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పను లు చేపట్టారు. ఆ తరువాత ఏ ప్రభుత్వం పనులను పూర్తి చేయకపోవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోందన్న వాదనలొస్తున్నాయి. ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

-సోంపేట రూరల్



పనులు అసంపూర్తిగా నిలిచిపోయిన పంచాయతీ భవనం

ప్రమాదకరం



శిథిలావస్థకు చేరుకున్న స్కూలు భవనం

కళింగపట్నం పంచాయతీ పెద్దపల్లిపేట మండల పరిషత్ మోడల్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆరు దశాబ్దాల కిందట నిర్మించిన భవనం శిథిలం కావడంతో వినియోగించడం లేదు. అయితే విద్యార్థులు అటుగా వెళ్లి ఆటలాడుకుంటున్నారని, దీంతో భవనం ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదు. తక్షణం ఈ భవనాన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో నక్క రామకృష్ణ వద్ద ప్రస్తావించగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

-గార

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



బెల్లుపడలో కందిపప్పు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీవో సుజాత



ఇచ్ఛాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీవో సుజాత తనిఖీ చేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'పుచ్చిపోయి..పురుగు పట్టి' శీర్షికతో వచ్చిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. బెల్లుపడ అంగన్‌వాడీ కేంద్రంలో డీలర్ల ద్వారా సరఫరా అవుతున్న నిత్యావసర సరుకులను పరిశీలించారు. సరుకుల్లో ఎటువంటి నాణ్యత లోపించినా వెంటనే ఐసీడీఎస్ కార్యాలయంతో పాటు పౌర సరఫరాల స్టాక్ పాయింట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆమె సూచించారు.

టీడీపీ సీనియర్ నేత 'గొర్లె' మృతి

● పాడె మోసిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్



పాడె మోస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఇన్‌సెట్‌లో) లక్ష్మణరావు (ఫైల్‌ఫొటో)

రణస్థలం, జూలై 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొర్లె లక్ష్మణరావు గురువారం మృతి చెందారు. ఆయన జూన్ 27న ఎచ్చెర్ల వద్ద టీడీపీ సమావేశానికి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అప్ప టి నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. ఈయన సోదరుడు గొర్లె హరిబాబునాయుడు ఎమ్మె ల్సీగా, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. మరో సోదరుడు గొర్లె రామారావు ప్రముఖ న్యాయవాది. లక్ష్మణరావు మరణ వార్త తెలు సుకున్న ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు పాతర్లపల్లి చేరుకున్నారు. నివాళులర్పించి లక్ష్మణరావు పాడెను మోశారు. లక్ష్మణరావుతో ఉన్న అను బంధాన్ని గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. మంచి స్నేహితుడిని కోల్పో యానన్నారు. లక్ష్మణరావు మృతికి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, చిన్న శ్రీను సంతాపం వ్యక్తం చేశారు.

లక్ష్మణరావు మృతికి సంతాపం

ఆమదాలవలస, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రణస్థలం మండల జడ్పీటీసీగా పనిచేసిన గొర్లె లక్ష్మణరావు మృతికి ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి సంతాపం తెలిపారు. ఈ మేరకు గురు వారం ప్రకటన విడుదల చేశారు. రాజకీయాలతో పాటు న్యాయవాదిగా సేవలు అందించిన లక్ష్మణరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయా లపాలై మృతిచెందడం బాధాకరమన్నారు. రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యక్తి అకాల మరణం పొందడం తీరని లోటు అని పేర్కొన్నారు.

ప్రతిభ కనబరిచిన సిబ్బందికి అభినందన



ఆర్టీసీ సిబ్బందిని సత్కరిస్తున్న అధికారులు

అరసవల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ శ్రీకాకుళం 1, 2వ డిపోల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి జోన్-1 డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానంద రెడ్డి గురువారం ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించి అభినం దించారు. అత్యధిక మైలేజీ, ఎక్కువ ఈపీకే, సంస్థలో సుదీర్ఘ కాలం ప్రమాద రహిత సర్వీసు, అత్యధిక హాజరు కలిగిన 8 మంది ఉద్యో గులను గుర్తించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో 1, 2 డిపోల మేనే జర్లు అమరసింహుడు, కె.రవిశంకర్ శర్మ, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధి కారి అప్పలనాయుడు, సీనియర్ ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్, మేనేజర్లు సంతోష్‌కుమార్, గంగరాజు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

కంచిలి, జూలై 31(ఆంధ్రజ్యోతి): కంచిలిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ-29, ఎస్టీ-3, బీసీ-సీ 10, ఓసీ-1 ఖాళీలున్నాయన్నారు. 6వ తరగతిలో ఎస్సీ 21, బీసీ-సీ-3, ఓసీ-1, 7వ తరగతి ఎస్సీ 10, బీసీ-సీ-10, ఓసీ-1 ఖాళీలు న్నాయన్నారు. 8వ తరగతిలో ఎస్సీ 5, ఓసీ 1, 9వ తరగతిలో ఓసీ-1, ఇంటర్ ఎంపీసీలో ఎస్సీ 27, ఎస్టీ1, బీసీ-2, బైపీసీలో ఎస్సీ-1, ఎస్టీ-2, బీసీసీ7 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యేలు పాల్గొని సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను వివరించారు.



అలికాంలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని, ఈ దిశగా సీఎం చంద్రబాబు నాయుడు శ్రమిస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం రూరల్ మండలం సింగుపురం పంచాయతీ బైరినాగులపేట, అలికాం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలికాం గ్రామంలో సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండ ఆదిత్యానాయుడు, టీడీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



మర్రిపాడులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి: శిరీష

వజ్రపుకొత్తూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. గురువారం మండలంలోని గరుడభద్ర పంచాయతీ పరిధి మర్రిపాడులో 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సూరాడ మోహనరావు, క్లస్టర్ ఇన్‌చార్జి దువ్వాడ హేంబాబుచౌదరి, నాయకులు శశిభూషణ్, రాపాక శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వితంతువులకు భరోసా

● జిల్లాలో 5,636 మందికి లబ్ధి

శ్రీకాకుళం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రెండున్నరేళ్ల నుంచి పింఛన్ కోసం నిరీక్షిస్తున్న వితంతువులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్ మంజూరు చేసింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 5,636 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. వీరికి ప్రతినెలా రూ.4 వేలు వంతున అందించనున్నారు. ప్రస్తుతం రూ2.25 కోట్లను విడుదల చేసింది. ఈ మొత్తాన్ని శుక్రవారం లబ్ధిదారులకు అందించనున్నారు. 2023, డిసెంబరు ఒకటో తేదీ అనంతరం భర్తను కోల్పోయిన వితంతువులకు పింఛన్ అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

క్రీడలపై ఆసక్తి పెంచడమే లక్ష్యం

● ఒలింపియన్ మాణిక్యాలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి పెంచడంతో పాటు వారికి చేయూతనిచ్చి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే క్రీడా భారతి లక్ష్యమని పూర్వపు ఇండియన్ వెయిట్ లిఫ్టర్, ఒలింపియన్ మాణిక్యాలు అన్నారు. అరసవల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గురువారం క్రీడాభారతి కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాణిక్యాలు మాట్లాడుతూ.. సెల్ ఫోన్లు విడిచిపెట్టి క్రీడలపై దృష్టి సారించడం ద్వారా క్రమశిక్షణ, విజయాలు వరిస్తాయన్నారు. క్రీడాభారతి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చెట్టికం రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.లక్ష్మణ్‌దేవ్, కోశాధికారిగా దండాసి జ్యోతిబాస్కర్, కార్యవర్గ సభ్యులుగా బి.ఖగేశ్వరరావు, మణికంఠ, కృష్ణారావు ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు.



ఒలింపియన్ మాణిక్యాలును సత్కరిస్తున్న క్రీడాభారతి ప్రతినిధులు

న్యూస్ బాక్స్

మహిళలకు రక్షణగా జీఆర్సీ సెంటర్

రణస్థలం, జులై 31(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న మహిళలకు రక్షణగా జండర్ రీసోర్స్ సెంటర్ సహాయపడుతుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్ అన్నారు. గురువారం వెలుగు కార్యాలయం ప్రాంగణంలో జీఆర్‌సీ సెంటర్‌ను ప్రారంభించారు. మహిళలకు చట్టపరమైన, న్యాయపరమైన సాయం ఈ కేంద్రం ద్వారా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఎస్ఐ ఎస్.చిరంజీవి, ఏపీఎం మాధవీలత, డీజీఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి దారుణం

ఇచ్ఛాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పీఏసీఎస్ డైరెక్టర్, జనసేన వీర మహిళ బాసి భారతిరెడ్డి ఇంటిపై దుండగుల దాడి దారుణమని ఆ పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు ఖండిం చారు. ఇలాంటి పిరికిపంద చర్యలు దురదృష్టకరమని ఒక ప్రకటనలో తెలిపారు. ఈదుపురంలో తాళాలు పగుల గొట్టి ప్రవేశించి వస్తువులను ధ్వంసం చేశారని, ఈ దాడికి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సొంతంగా రోడ్డుకు మరమ్మతులు

కంచిలి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏపీమోడల్ స్కూల్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పాడైంది. అధికారులు పట్టించు కోకపోవటంతో స్పందించిన స్థానికుడు కిశోర్ కుమార్ పాడి సొంత నిధులు వెచ్చించి క్రషర్ డస్ట్ వేసి బాగు చేయించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, భాస్కర్ పాణిగ్రాహి పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే రైతులకు మేలు

● డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ

ఆమదాలవలస, జూలై 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలోనే రైతులకు మేలు జరిగిందని, రైతు పక్షపాతిగా నిలిచిందని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. గురువారం పట్టణ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రవి కుమార్‌పై వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ విమర్శలు చేస్తున్నారని, రాజకీయ ఓనమాలు నేర్చుకొని మాట్లాడాలని సూచించారు. కనీస అవగాహన లేకుండా మాట్లాడడం తగదన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ కుమార్తె లండన్‌లో డిగ్రీ పట్టా పొందిన సందర్భంగా కాన్వొకేషన్‌లో రవికుమార్ పాల్గొంటే లేనిపోని ఆరోపణలు చేయడం ఆయన విజ్ఞతకే విడిచి పెడుతున్నామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఎరువులు కొరత లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక్క ఏడాదిలోనే రూ.600 కోట్లు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు శిమ్మ మాధవి, నాయకులు సంపదరావు మురళీ, తాడేల రాజారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ అధ్యక్షుడు శివ్వాల సూర్యనారాయణ

హమాలీల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న హమాలీలు

ఎచ్చెర్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల బేవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న బాట్లింగ్ యూనిట్‌ను విడదీద వద్దని కోరుతూ హమాలీలు గురువారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వర రావు మాట్లాడుతూ.. ఈ యూనిట్‌ను విడదీసి టెక్కలిలో అద్దె భవనంలో ఎందుకు ఏర్పాటు చేయాల్సి వస్తుందో తెలియజేయాలన్నారు. టెక్కలి డిపో ఏర్పాటు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలన్నారు. గతంలో దళితుల వద్ద భూములు తీసుకుని బాట్లింగ్ కంపెనీ పెట్టారని, అప్పటి నుంచి ఏళ్ల తరబడి ఇదే పనిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న దళితుల పొట్ట కొట్టవద్దన్నారు. కార్యక్రమంలో హమాలీల యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, నిడిగింట్ల రమణ, జి.శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. గురువారం రామయ్యపుట్టుగ కార్యాలయంలో నాలుగు మండలాల హాస్టల్ వార్డెన్లతో హాస్టళ్ల అడ్వైజర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సదుపాయాల కల్పనతో పాటు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు.

బంగారు దుకాణాలపై అధికారుల దాడులు

(ఐదో పేజీ తరువాయి)

వ్యాపారులు తమ బండారం బయట పడకుండా ఉండేందుకు తూకం యంత్రాల్లో తేడాలను సరి చేశారు. మరికొందరు దుకాణాలను మూసివేశారు. ఇంకొందరు శ్రావణ మాసం ప్రత్యేకంగా తయారు చేసిన కాసులు బయటకు కనిపించకుండా ఆదరబదరాగా దుకాణాల నుంచి వాటిని మాయం చేసినట్లు సమాచారం.



బంగారు దుకాణంలో బిల్లులను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ చిన్నమ్మి









నిధులు మంజూరు కాక.. నిర్మాణానికి నోచుకోక

● పరాయిపంచన విధుల నిర్వహణ ● ఇదీ నందిగాం మండలపరిషత్ కార్యాలయం పరిస్థితి



నందిగాం ఉన్నతపాఠశాలలోని ఓ గదిలో విధులు నిర్వహిస్తున్న మండలపరిషత్ సిబ్బంది

నందిగాం,జూలై31(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలపరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఉన్నతపాఠశాల భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇక్కడ కొత్త భవన నిర్మాణానికి నిధులకోసం ప్రతిపాదనలు పంపించినా మంజూరుకునోచుకోలేదు. మండలపరిషత్ కార్యాలయ భవనం శ్లాబు పెచ్చులూడిపోవడంతో పరాయిపంచకు 2022 డిసెంబరులో మార్చారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా సొంత భవన నిర్మాణానికి చొరవ తీసుకోకపోవడంతో సమావేశాలు, విధులు నిర్వహణకు సిబ్బందికి అవస్థలు తప్పడంలేదు.మూడు పాఠశాల గదులు కార్యాలయ నిర్వహణకు జడ్పీ సీఈవో, కలెక్టర్ సూచనల మేరకు తీసుకున్నా, మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశానికి అదనంగా మరో భవనాన్ని వినియోగించుకోవాల్సి వస్తోంది. తీసుకున్న మూడు భవనాల్లో సిబ్బంది విధులు నిర్వహణతో పాటు ఎంపీడీవో చాంబర్, చిన్నచిన్న సమావేశాలకు ఒక భవనం, ఇంజనీరింగ్, ఎంపీపీలకు మరో భవనాన్ని తీసుకొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, జడ్పీటీసీ పేడాడ భార్గవి తిలక్‌లు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మండల పరిషత్ నూతన భవనానికి విన్నవించగా కలెక్టర్ సూచనలతో ప్రతిపాదనలు కోరారు. కానీ భవన నిర్మాణానికి నిధులువిడుదలకాకపోవడంతో సిబ్బంది పరాయి పంచన అరకొర వసతులతో నెట్టుకురావాల్సివస్తోంది.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

పొందూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పొందూరు పంచాయతీ జోగన్నపేట సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన టొంపల సింహాచలం (84)మృతిచెందాడు. పొందూరునుంచి తండ్యాం వైపు వెళుతున్న ఆటో రోడ్డుపై నడిచి వెళుతున్న వృద్ధుడిని ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు.కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించేలోగానే మృతిచెందాడు. ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఆమదాలవలస, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదో వార్డు రెడ్డివానిపేట గ్రామం వద్ద సుమారు 50 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురువారం సాయంత్రం చనిపోయి ఉండవచ్చని గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి విచారణ చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి ఆ చుట్టుపక్కల గ్రామాల్లో భిక్షాటన చేశాడని, గురువారం మృతి చెందాడని తెలుస్తోంది.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

పొందూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం(గారపేట)-పుల్లాజీపేట (రెడ్డిపేట) గ్రామాల మధ్య రెండు గురువారం బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పొందూరు, చిలకపాలెం నుంచి ఎదురెదురుగా అతివేగంతో వస్తున్నారు. వారిలో ఒకరు ప్రాణాప్రాయ స్థితిలో ఉన్నారు. ఇద్దరిని స్థానికులు 108లో శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

నందిగాం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని హర్షబాడ పంచాయతీ పరిధిలోగల పెద్దగురువూరులో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పెద్దింటి జానకిరావుకు చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. పూర్తిగా గుడిసె కాలిపోవడంతో దానిలో ఉన్న ధాన్యం, బియ్యం, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుడికి ఆదుకోవాలని గిరిజన ఆదివాసీ సంఘం ప్రతినిధులు ఎన్.జగ్గారావు, ఎన్.నాగరాజు, వి.కృష్ణారావు కోరారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



తండ్రి చితి వద్ద దహన సంస్కారాలు చేస్తున్న కుమార్తె విజయలక్ష్మి

సరుబుజ్జిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాతపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు టంకాల చిన్నప్పలనాయుడు (65) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. ఒక కుమార్తె అమెరికాలో, మరొకామె బెంగళూరులో, మరొకరు విశాఖపట్నంలో కుటుంబాలతో ఉంటున్నారు. తండ్రి చనిపోయిన సమయానికి ఇద్దరు కుమార్తెలు అందుబాటులో లేకపోవడంతో మగ సంతానం లేని చిన్న ప్పలనాయుడు మృతదేహానికి పెద్ద కుమార్తె విజయలక్ష్మి అంత్యక్రియలు చేశారు. ఉపాధ్యాయుడిగా ఈ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొంది అనేక సంఘ సేవ కార్యక్రమాలు నిర్వహించారు అప్పలనాయుడు. అలాగే ఆంజనేయస్వామి గుడి నిర్మాణం చేపట్టారు.

ఎల్.ఎన్.పేటలో పోలీసు అవుట్ పోస్టు

● కార్యాలయం ఏర్పాటుకు సీఐ ఆధ్వర్యంలో పరిశీలన



పనులు నిలిచిపోయిన స్త్రీశక్తి భవనాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

ఎల్.ఎన్.పేట,జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎల్.ఎన్.పేటలో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసేందుకు శాఖాపరంగా చర్యలు చేపట్టినట్లు ఆమదాలవలస సీఐ పి. సత్యనారాయణ తెలిపారు.ఈ మేరకు అవుట్‌పోస్టు కార్యాలయం ఏర్పాటుకు మండల పరిషత్ నుంచి తీర్మానం తీసుకున్నట్లు చెప్పారు.గురువారం ఎల్.ఎన్.పేటలోని మండల పరిషత్ కార్యాలయానికి ఆనుకుని ఉన్నదక్షిణవైపు సగం నిర్మాణంలో నిలిచిపోయిన స్త్రీశక్తి భవనం సీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట రెండు మండలాలకు సరుబుజ్జిలిపోలీసుస్టేషన్ నుంచే పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. మండలానికి ఒకపోలీసుస్టేషన్ ఉండాలన్న నిబంధనల్లోభాగంగా పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటుకు పరిశీలించినట్లు చెప్పారు.ఎల్.ఎన్.పేట మండలం పరిధిలో గల గ్రామాల్లో గొడవలు, తగాదాలు జరిగే సమయంలో సరుబుజ్జిలి పోలీసు స్టేషన్‌కు రావలసివస్తోందని తెలిపారు.దీంతో ప్రజల ఇబ్బందులదృష్ట్యా అవుట్ పోస్ట్(పోలీసు)స్టేషన్ ఏర్పాటుచేసి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు శాఖాపరంగా తగిన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కాగాస్త్రీశక్తి భవనం నిలిచిపోయిన పనులు వేగవంతంగా చేయాలని కాంట్రాక్టరుకు కోరినట్లు తెలిపారు. ఆయనతోపాటు సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమావతి ఉన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన



లైంగిక వేధింపుల నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పలాస,జూలై 31(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులతో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి ఇందిరాచౌక్ వరకూ ర్యాలీ చేపట్టారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి, సాధికారిత కోఆర్డినేటర్ ఎ.సునీత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశాలు

హరిపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని రాధాకృష్ణాపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 6,7,8 9, పదో తరగతితో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఎస్సీ కేటగిరిలో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఐదో తరగతిలో 57, 6లో 37, 7లో 35, 8లో 35, 9లో 44, పదో తరగతిలో 49, ఇంటర్ మొదటి ఏడాది బైపీసీలో రెండు, ఎంపీఈలో 26సీట్లు ఉన్నాయని తెలిపారు. వివరాలకు 9441287334, 9542377972 నెంబర్లుకు సంప్రదించాలని కోరారు.

గిరిజన మహిళకు ప్రసవ కష్టాలు

● బురదలో కూరుకుపోయిన 108 ● అతి కష్టమ్మీద ఆసుపత్రికి తరలింపు

పలాసరూరల్, జూలై31(ఆంధ్రజ్యోతి): కొఠారింగితాళభద్రకు చెందిన ఓ గిరిజన గర్భిణికి నెలలు నిండడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వాహనం నిలిచిపోవడంతో తల్లడిల్లిపోయింది. ప్రసవానికి సమయం దగ్గర పడుతుండడంతో అక్కడ నొప్పులు ఎక్కువకావడం వల్ల అవస్థలకు గురైంది.బంధువులు, గ్రామస్థుల కథనం మేరకు... మండలంలోని కొఠారింగితాళభద్రకు చెందిన గర్భిణి సవర శ్యామలకు నెలలు నిండడంతో గురువారం పురిటి నొప్పులతో బాధపడడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గ్రామానికి వెళ్లే రహదారి బురదమయం కావడంతో కష్టం మీద 108 వాహనం గ్రామానికి చేరుకుంది. శ్యామలను ఎక్కించి పలాస ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వాహనం బురదరోడ్డులో కూరుకుపోయింది. ఆ సమయంలో శ్యామలకు నొప్పులు అధికం కావడంతో రోడ్డుపైనే అష్టకష్టాలు పడింది. వాహనాన్ని బయటకు తీసుకొచ్చి ఆమెను అతికష్టం మీద పలాసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బొత్తాడసింగిలో తోపులాట

● ఇరువర్గాలపై కేసు నమోదు

ఎల్.ఎన్.పేట, జూలై 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని బొత్తాడసింగి రైతుసేవా కేంద్రం వద్ద మంగళవారం సాయంత్రం ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోగా కేసు నమోదు చేసినట్లు సరుబుజ్జిలి ఎస్‌ఐ బి. హైమావతి తెలిపారు. ఎస్‌ఐ హైమావతి, గ్రామస్థుల కథనం మేరకు.. పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించేందుకు ఏవో కె. సింహాచలం గ్రామంలోని రైతులకు సమాచారం ఇవ్వడంతో రైతు సేవా కేంద్రం వద్దకు వైసీపీ, టీడీపీ నాయకులు చేరుకున్నారు. ఆ సమయంలో కొంతమంది రైతులు ఎరువులు సక్రమంగా ఇవ్వడంలేదని, నాయకులు చెప్పినవారికే ఇస్తున్నారని వ్యవసాయాధికారికి తెలియజేశారు. దీంతో ఎరువుల పంపిణీలో ఎటువంటి అక్రమాలు జరగకుండా అందరికీ పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. చొర్లంగి రమ్మని చెప్పి ఎరువులు ఇవ్వకుండా పంపించి వేశారని బొత్తాడసింగి రైతులు ఏవోను నిలదీశారు. అటువంటిప్పుడు చొర్లంగి రమ్మనమని సమాచారం ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఆ సమయంలో టీడీపీకి చెందిన అంపిలి పోలినాయుడు జోక్యంచేసుకొని వ్యవసాయాధికారిని నిలదీయవలసిన పనిలేదని చెబుతుండగా ఒకరిపై ఒకరు తోసుకున్నారు.వైసీపీకి చెందిన ఈగల చిన్నారావు టీడీపీ కార్యకర్త పోలినాయుడు ఒకరిపై ఒకరు చేయిచేసుకొని తోసుకున్నారు. చిన్నారావు తోపాటుఆయన అన్నదమ్ములపై పోలినాయుడు, పోలినాయుడుపై ఈగల చిన్నారావుతోపాటు ఆయన అన్నదమ్ముల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశారు.

డప్పు కళాకారులకు న్యాయం చేయాలి

హిరమండలం, జూలై31(ఆంధ్రజ్యోతి):డప్పు కళాకారులకు ప్రభుత్వ న్యాయం చేయాలని దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గాసి గణేష్ కోరారు.గురువారం హిరమండలం బ్యారేజీ సెంటర్‌లో దళిత డప్పు కళాకారుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగస్థల కళాకారులకు ఇస్తున్న రూ.ఏడు వేల పింఛన్‌తోపాటు ప్రతి డప్పు కళాకారుడికి మూడెకరాల భూమిఇవ్వాలని డిమాండ్‌చేశారు.ఈనెల 29 కొత్తూరు, భామిని, హిరమండలం, పాతపట్నం మండలాలను కలుపుకొని ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్డసిరి ప్రదీప్, పి.రామారావు, రాజారావు, రంగారావు, మహేష్ పాల్గొన్నారు.

మేలుజాతి దూడల ఉత్పత్తిపై దృష్టి సారించాలి

పాతపట్నం,జూలై 31(ఆంధ్రజ్యోతి): మేలుజాతి దూడల ఉత్పత్తిపై దృష్టి సారించాలని పశు గణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యనిర్వాహణాధికారి సత్యప్రకాశ్ తెలిపారు. గురువారం పాతపట్నంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యసిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 40వేల మేలుజాతి దూడల ఉత్పత్తిలక్ష్యం కాగా ఇప్పటివరకూ 15వేల డోసులు సరఫరాచేసినట్లు తెలిపారు. ఈవిధానంద్వారా 90శాతం ఆడదూడలే జన్మిస్తాయని చెప్పారు. సమావేశంలో ఏడీ మంచు కరుణాకరరావు, పశు వైద్యాధికారులు బి.శ్రీవాణి, పి.అనిల్, కె.మౌనిక పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

నరసన్నపేట, జూలై31(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు పిల్లలు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు సూచించారు. గురువారం నరసన్నపేట ప్రభుత్వోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భవితకేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఐఈడీ ఉపాధ్యాయులు కృష్ణవేణి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరఫీ

పోలాకి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):దివ్యాంగుల కోసం భవిత కేంద్రాల ఏర్పాటు చేసినట్లు పోలాకి భవితకేంద్ర పరిశీలకురాలు బి. శైలజ తెలిపారు. గురువారం భవిత కేంద్రంలో చేరిన దివ్యాంగులకు ఫిజియోథెరఫీ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిత కేంద్రంలో 15 మంది దివ్యాంగులు చేరరాని చెప్పారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రభూషణరావు

జలుమూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను లాభాల బాటలో నడిపించి రైతులు అభ్యున్నతికి కృషిచేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. గురువారం అల్లాడ సొసైటీ కార్యాలయం ఆవరణలో సొసైటీ చైర్మన్‌గా వెలమల చంద్రభూషణరావు, సభ్యులుగా కొబగాపు వెంకటరావు, సనపల రామ్‌జీ ప్రమాణ స్వీకారంచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, డీసీసీబీచైర్మన్ శివ్వాల సూర్యం, టీడీపీ మండలాధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, కన్వీనరు బగ్గు గోవిందరావు, జడ్పీటీసీ మెండ విజయశాంతి, ఏఎంసీ చైర్మన్ తత్ర బలరాం, చల్లవానిపేట, నరసన్నపేట సొసైటీ అధ్యక్షులు దుంగ స్వామిబాబు, అప్పారావు, నాయకులు సత్యం, అడపా చంద్రశేఖర్, హనుమంతు రంగనాథం, పంచిరెడ్డి రామచంద్రరావు, చల్లవానిపేట డీసీసీబి మేనేజరు వెంకటరమణ, అల్లాడ సీఈవో గిరిధర్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పాతపట్నం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీది జడ్పీ ఉన్నతపాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఎనిమిది, తొమ్మిదో తరగతుల్లో ప్రతిభకనబరిచిన టాప్ 10మంది విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్ట్ కోఆర్డినేటర్ ఎస్.ప్రసన్నకుమార్ ప్రోత్సహకాలు అందజేసేందుకు ముందుకొచ్చారు.ఈ మేరకు ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున హెచ్‌ఎం బి.సింహాచలం చేతులమీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్‌సభ్యులు షణ్ముఖరావు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

టెక్కలి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీచేసిన ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్‌చేసి వారు కోరుకున్న స్థానాలకు పంపించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు కోరారు. గురువారం టెక్కలి మెయిన్ బజారు పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీ ఉపాధ్యాయులు తమ స్థానాలు కోరుకొని మూడు నెలలు కావస్తున్నా నేటికీ వారిని రిలీవ్ చేయలేదన్నారు. 30శాతం ఐఆర్ ప్రకటించి పీఆర్సీ వేయాలని కోరారు. బకాయి వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం ప్రదర్శిస్తుందని ధ్వజమెత్తారు.యూటీఎఫ్ నాయకుడు కురమాన దాలయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని హితవుపలికారు. కార్యక్రమంలో పాలవలస ధర్మారావు, కుప్పిలి కామేశ్వరరావు, పడాలగణపతిరావు, వైకుంఠరావు, శంకరరావు, కుమారస్వామి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పాఠశాలకు వితరణ

జలుమూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన పలువురు పాఠశాల అభివృద్ధికి రు.22,000 విరాళాలు ఇచ్చారు. ఈమేరకు హెచ్‌ఎం వి.నిర్మలాదేవికి గురువారం అందజేశారు. బదిలీపై వెళ్లిన దుర్గాభాయి, ఎస్.కుమారస్వామి, వి.శ్రీవాణి, ఎన్.కామేశ్వరి రూ. ఐదు వేలు చొప్పున, జి.రవి రెండు వేలు, ఆనంద్ కిరణ్ మ్యూజికల్ డ్రమ్స్ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చల్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త ఆరుబయట వేయవద్దు: ఎంపీడీవో

పలాసరూరల్,జూలై31(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చెత్తను ఆరుబయట వేయవద్దని, చెత్తబండి వచ్చినప్పుడు అందించాలని ఎంపీడీవో ఎన్.వసంత్‌కుమార్ కోరారు. గురువారం మండలంలోని మామిడిమెట్టులో చెత్త సేకరణపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు.



మామిడిపల్లి గ్రామస్థులకు అవగాహన కలిగిస్తున్న వసంతకుమార్

నేడు మంత్రి పర్యటన

కోటబొమ్మాళి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోగల చిట్టివలస పంచాయతీ, తులసిపేటలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉదయం పర్యటించనున్నారు.ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్ గురువారం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పోలాకి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):పోలాకి 11కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం మూడు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో టెక్కలి ఈఈ ఈ. నరసింహకుమార్, ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు. పోలాకి 11కేవీ ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల దృష్ట్యా గొల్లలవలస, సంతలక్ష్మీపురం, తోటాడ, సుసరాం, తోటాడ స్టోన్‌క్రషర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

● జి.సిగడాం, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగనుందని శ్రీకాకుళం ట్రాన్స్‌కో ఈఈ పి.యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. జాడ, జగ న్నాథవలస, ఎందువపేట, ముక్కుపేట తదితర గ్రామాలకు ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆర్టీఐపై అవగాహన అవసరం

హరిపురం, జూలై31 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) పై ప్రతి రైతుకు అవగాహన ఉండాలని ఏవో నాగరాజుతెలిపారు. గురువారం బాలిగాంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ఆర్టీఐపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది జ్యోత్స్న, ఉదయ్ పాల్గొన్నారు.

● నందిగాం, జూలై 31(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం పట్ల వీఏఏలు అవగాహన కలిగిఉండాలని ఏవో పి.శ్రీకాంత్‌వర్మ తెలిపారు. గురువారం నందిగాం రైతుసేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం-2005పై(ఆర్టీఐ)పై వీఏఏలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో వాసవి పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే...

● రెంటికోట పెద్దచెరువు వద్ద కూలిపోయిన రక్షణ గోడ

పలాసరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటికోట నుంచి గొప్పిలికి వెళ్లే రహదారిలో రెంటికోట పెద్దచెరువు వద్ద ఏపాటి ఆదమరిచినా ప్రమాదం పొంచిఉంది. చెరువుకు సంబంధించి రక్షణగోడ కూలిపోయినా మరమ్మతులకు నోచుకోలేదు. ఈ రహదారి ఒడిశాలోని పలు ప్రాంతాలకు ప్రధాన మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఇక్కడి చెరువు మలుపు వద్ద రిటైనింగ్ వాల్ దెబ్బతినడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే చెరువు లోపలకు దూసుకువెళ్లే ప్రమాదముందని వాహనచోదకులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణగోడను నిర్మించాలని కోరుతున్నారు.



చెరువువద్ద రక్షణగోడ కూలిన దృశ్యం

తీరం భద్రత ఎలా?

(ఐదో పేజీ తరువాయి)

భద్రతా చర్యలు పర్యవేక్షించాలి. విదేశీ మత్స్యకారులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే అదుపులోకి తీసుకోవాలి. నావీ విభాగానికి సమాచారం అందించాలి. కానీ, సిబ్బంది లేకపోవడం ఒక ఎత్తు అయితే.. విధి నిర్వహణకు అవసరమైన మరబోట్లు, అత్యాధునిక పరికరాలు లేకుండా పోయాయి. దీంతో సిబ్బందిపడుతున్న బాధలు వర్ణనాతీతం. గతంలో సమకూర్చిన మరబోట్లు, పరికరాలు తితలీ తుఫాన్ సమయంలో పాడయ్యాయి. వాటి స్థానంలో కొత్తవాటిని సమకూర్చలేదు.

పరిధి ఎక్కువ.. సిబ్బంది తక్కువ

బారువమెరైన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇచ్ఛాపురం, సోంపేట,కవిటి, మందస మండలాలు ఉన్నాయి. 36 తీర ప్రాంత రెవెన్యూ గ్రామాలు, మరో ఐదు శివారు గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ 42 మంది కానిస్టేబుళ్లకుగాను 9 మంది మాత్రమే ఉన్నారు. ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో శివారు మండలాల్లో విధుల నిర్వహణ సిబ్బందికి కష్టతరంగా మారుతోంది. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి మందస మండలం గంగువాడ వరకూ విధి నిర్వహణ కత్తిమీద సాములా మారింది.

● భావనపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లో 63 తీర ప్రాంత రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మరో ఏడు శివారు గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ 82 మంది సిబ్బంది ఉండాలి. కానీ కేవలం 29 మంది మాత్రమే ఉన్నారు. ఖాళీలు, అరకొర వసతులతో తీర ప్రాంత రక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది.

● కళింగపట్నం పరిధిలో గార, శ్రీకాకుళం, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో 43 తీర ప్రాంత రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ 48 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాల్సి ఉండగా.. కేవలం 18 మంది మాత్రమే ఉన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

పర్యవేక్షణ లేక.. పరాయిపంచన నిర్వహణ

● సొంత భవనాలకు నోచుకోని వైనం
● ఇదీ చిన్నకొజ్జిరియాలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల దుస్థితి



సామాజిక భవనంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కంచిలి, జూలై 31(ఆంధ్రజ్యోతి): చిన్నకొజ్జిరియాలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంపై పర్యవేక్షణ కొరవడడంతో పరాయి పంచన నిర్వహిస్తున్నారు. ఇక్కడ భవనాల నిర్మాణాలు నిధుల కొరతతోపాటు వివిధ కారణాల వల్ల ముందుకుసాగడం లేదు.

కంచిలి మండలంలోని చిన్న కొజ్జిరియాలో గల ప్రభుత్వ ఫౌండేషన్ పాఠశాలకు సొంత భవనం లేక సామాజిక భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ కమిటీ సభ్యులతోపాటు గ్రామస్థులు అప్పటి పాలకులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయితే పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనల నేపధ్యంలో గామస్థులే కూల్చివేశారు. అనంతరం పక్కనే ఉన్న సామాజిక భవనంలో ప్రస్తుతం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు ఒక ఉపాధ్యాయుడు ఉండగా, గ్రామస్థులంతా కలిసి విద్యా వలంటీరును ఏర్పాటు చేసుకున్నారు. 11 మంది రెగ్యులర్ విద్యార్థులతోపాటు అంగన్‌వాడీకేంద్రం నుంచి చేరిన మరో ఆరుగురు కలిపి మొత్తం 17 మంది అభ్యసిస్తున్నారు. వీరికి తరగతులతోపాటు మధ్యాహ్న భోజనం సైతం ఒకే గదిలో నిర్వహిస్తుండడంతో వారంతా ఇబ్బందిపడుతున్నారు. కాగా నూతన భవనం నిర్మించాలని తల్లిదండ్రులు, గ్రామపెద్దలు స్పందన కార్యక్రమంలో రెండుసార్లు ఫిర్యాదుచేశారు. దీంతో భవన నిర్మాణానికి నాడు-నేడు రెండో ఫేజ్‌లో నిధులు మంజూరయ్యాయని ఫిర్యాదును వెనక్కి తీసుకొనేలా చేశారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం పడితే సామాజిక భవనంలోకి నీరు చేరి, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా చిన్న కొజ్జిరియాలో ఫౌండేషన్ పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించి పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు పంపించామని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదక పంపించామని తెలిపారు.

బిల్లులుకాక నిలిచిన పనులు

చిన్నకొజ్జిరియాలోని అంగన్‌వాడీకేంద్రానికి వసతి సమస్య వేధిస్తోంది. సొంత భవనం లేక పంచాయతీ భవనంలో ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఐదుగురు బాలలు ఉన్నారు. గతంలో 11 మంది చిన్నారులు ఉండగా, ఆరుగురు ఫౌండేషన్ పాఠశాలలో చేరారు. 2018-19 లో భవనం నిర్మాణానికి ఎనిమిది లక్షలు మంజూరుకావడంతో పనులు ప్రారంభించినా బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ నిలిపివేశారు.



గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీకేంద్రం నిర్వహిస్తున్న దృశ్యం